క్లుప్తంగా

యంత్రాల వినియోగంతో అధిక దిగుబడి


ట్రాక్టర్ బూమ్ స్ప్రేయర్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మద్దికెర : పంటల సాగులో యంత్రాలను వినియోగించడం వల్ల సమయంతో పాటు కూలీల ఖర్చు కూడా ఆదా అవుతుందని తక్కువ పెట్టుబడితో అధిగ దిగుబడులు సాధించవచ్చని ఏఓ రవి అన్నారు. శనివారం మద్దికెర పరిసరాల్లో ట్రాక్టర్ బూమ్ స్ప్రేయర్ ప్రదర్శనను పరిశీలించారు. ఈ స్ప్రేయర్‌తో ఒకరోజులో కనీసం 70 నుంచి 80 ఎకరాల్లో శనగ పంటకు మందు పిచికారీ చేయవచ్చన్నారు. అనంతరం పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

వైభవంగా గ్రామోత్సవం


చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్ : మొలగవల్లి గ్రామంలో కొలువైన శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. చెన్నకేశవ స్వామి,లక్ష్మీసమేత భూదేవి ఉత్సవమూర్తులను హనుమద్వాహనం, అశ్వవాహనం, గరుడు వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అంతకుముందు గ్రామస్తులు సద్దలతో తయారు చేసిన కుడుములను ఇరువర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విసురుకున్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిప్పగిరి:రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నంచర్ల,నేమకల్లు రైల్వే స్టేషన్ మధ్యలో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంచర్ల నుంచి నేమకల్లు వైపు వెళ్లే రైల్వే డబుల్ లైన్ మధ్యలో 453/25 కి.మీ వద్ద సుమారు 50 సంవత్సరాలు వయస్సు కలిగిన ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయమై రైలు పట్టాల మధ్యన మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం రైల్వే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి దగ్గర ఎలాంటి గుర్తింపు పత్రాలు లేవని, నీలం రంగు చొక్కా, గీతల ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

వరిలో సాధారణ దిగుబడి


కోతిరాళ్లలో వరిలో పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పత్తికొండ(తుగ్గలి) : ఈ ఏడాది వరి పంటలో సాధారణ దిగుబడులు వస్తాయని పంట కోత ప్రయోగాల్లో వెల్లడైందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. స్టాటికల్ ఆఫీసర్ రంగనాయకులు పర్యవేక్షణలో శనివారం కోతిరాళ్ల రైతు మునిస్వామి వరి పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టగా 9.460 కిలోల సాధారణ దిగుబడి వచ్చినట్లు తెలిపారు. మామూలుగా 15 నుంచి 20 కేజీల వరకు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రియాజ్‌బాషా, శ్రీనాథ్, ఎంపీఈవో రాజేశ్వరి పాల్గొన్నారు.

రబీ పంటలకు సాగునీరు


కాలువపై పర్యటిస్తున్న ఈఈ, డీఈ

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువ కింద ఆయకట్టుకు ఈసారి రబీ సీజన్‌లో కూడా పూర్తి స్థాయిలో సాగు నీరు అందిస్తామని ఎల్ఎల్‌సీ ఈఈ శైలేశ్వర్, డీఈ మహమ్మద్‌షఫీ తెలిపారు. తుంగభద్ర దిగువ కాలువపై వారు శనివారం పర్యటించి 74, 75, కౌతాళం మేజర్, మాధవరం మేజర్, హాల్వి సెక్షన్‌లలో సాగునీటి సరఫరాను పరిశీలించారు. వారు మాట్లాడుతూ తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ పుష్కలంగా ఉన్నందున ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగుచేసే పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీరు అందుతాయన్నారు. వారి వెంట ఏఈ ఈశ్వర్ ఉన్నారు.

ఉత్సవాలకు వేళాయే..

- ఈనెల 13నుంచి లింగనేనిదొడ్డిలో మునిరంగస్వామి తిరునాల
- 15న ఎద్దుల బండలాగుడు పోటీలు
- అదే రోజు తిమ్మగురు స్వామి, మునిరంగ స్వామి రథోత్సవం

తుగ్గలి : మండలంలోని లింగనేనిదొడ్డి సమీపంలోని గద్దవాలిన కొండపై వెలసిన మునిరంగస్వామి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. ఏటా మార్గశిర మాసంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. నంద్యాల పక్కీరప్ప తాతయ్య ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ శ్రీనివాసులు, పూజారి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. 13న ఉదయం గణపతి పూజ, కాశీవిశ్వనాథస్వామికి రుద్రాభిషేకం, పార్వతీదేవికి అష్టోత్తర శతనామార్చన, మంగళహారతి, 14 ఉదయం మునిరంగస్వామి, కాశీవిశ్వనాథుడు, పార్వతీదేవి తిమ్మగురు స్వాములకు ప్రత్యేక పూజలు, పంచమాంకము లు నాటక ప్రదర్శన, 15న ఉదయం లింగనేనిదొడ్డి నుంచి తిమ్మగురుడు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీమునిరంగస్వామి ఉత్సవమూర్తులను కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్తారు. 8గంటలకు మహా గణపతి, సుదర్శన హోమం, 10.30 గంటలకు తిమ్మగురుస్వామి రథోత్సవం, మునిరంగస్వామి కల్యాణం, సాయంత్రం మునిరంగస్వామి రథోత్సవం ఉంటుందని వివరించారు.

ఆలయ విశిష్టత..

తుగ్గలి మండలం లింగనేనిదొడ్డికి 4కి.మీ. దూరంలోనున్న గద్దవాలిన గౌతమ మహాముని కొండపై క్షేత్రం ఉంది. క్షేత్రంలో మునిరంగస్వామి పుట్టుశిల,


లింగనేనిదొడ్డి కొండపై పూజలందుకుంటున్న మునిరంగస్వామి

నాగపడగ గుండు, ఓబులేసు గుడి, రాముల వారి గుహ, హస్తలగుండు ఉన్నాయి. క్షేత్రంలో సాక్షి గణపతి, శ్రీదేవి భూదేవి సహిత శ్రీముని రంగస్వామి, విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరుడు, అభయాంజనేయస్వామి, దత్రాత్రేయస్వామి, నాగదేవతలు, వేంకటేశ్వరస్వామి, తిమ్మగురుస్వామి, షిరిడీ సాయిబాబా, అష్టలక్ష్మీ దేవతలను ప్రతిష్ఠించారు. ఎక్కడా లేని విధంగా మూడున్నర అడుగుల ఎత్తులో నవగ్రహాలను ప్రతిష్ఠించి ఒక్కో దానికి ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేయడం విశేషం. నంద్యాలలో గురుకుల పీఠం స్థాపించిన మారెల్ల పక్కీరప్ప తాతయ్య భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు.


ప్రత్యేక మండపాల్లో వెలసిన నవగ్రహాలు

14న భజన పోటీలు..

ఉత్సవాలు పురస్కరించుకుని ఈనెల 14వ తేదీన రాత్రి క్షేత్రంలో భజన పోటీలు ఏర్పాటు చేశారు. గెలుపొందిన భజన బృందాలకు వరుసగా రూ.15వేలు, రూ.13వేలు, రూ.11వేలు, రూ.9వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2,500, రూ.1500, రూ.వెయ్యి నగదును అందజేయనున్నారు. వివరాలకు 9618625618, 8978266690 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

15న రాతి దూలం లాగుడు పోటీలు..

ఉత్సవాలను పురస్కరించుకొని 15వ తేదీన న్యూ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. గెలుపొందిన వృషభ విజేతల యజమానులకు రూ.50వేల నుంచి వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు దాతలు తెలిపారు. వివరాలకు సెల్: 8008020820, 9989981353 నంబరల్లో సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

హాలహర్వి: గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆలూరు పంచాయతీరాజ్ డీఈ మనోహర్ సూచించారు. శనివారం మండలంలోని మెదేహాల్, కామినహాల్ గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పంచాయతీరాజ్ ఏఈ సోమప్ప, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పచ్చారపల్లి పాల్‌రెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, ఉమాకాంత్‌స్వామి పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం ఎన్నిక

తుగ్గలి : తుగ్గలి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడుగా మాజీ సర్పంచ్ బెస్త పుల్లన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం తుగ్గలిలో ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఎన్నిక అధికారి నాగరాజు ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా పుల్లన్న, ఉపాధ్యక్షుడుగా లక్ష్మన్న, కార్యదర్శిగా జక్కన్న, సభ్యులుగా మల్లికార్జున, సుంకన్న, కంబగిరి, ఎర్రిస్వామి, ఆకుల నారాయణ, బారిక నాగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని సంఘం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ వసంత పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్


హొళగుంద జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హొళగుంద: పిల్లలు చదువులో రాణించాలన్నా, వారు ఉన్నత స్థాయికి ఎదగాలన్నా తల్లిదండ్రుల కృషి ఎంతో అవసరమని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నజీర్ అహమ్మద్, ఎస్ఎంసీ చైర్మన్ ద్వారకనాథ్ అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఎమ్మెల్యేను బ్లాక్ కమెండో విద్యార్థుల మధ్య హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. 2వేల మంది విద్యార్థులున్న పాఠశాలను క్రమశిక్షణతో నడిపిస్తున్న హెచ్‌ఎం, టీచర్లను ఎమ్మెల్యే అభినందించారు. హెచ్‌ఎం నజీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఈశా, ఎస్కేగిరి, కోగిలతోట శేషప్ప, ఎంపీటీసీ మల్లికార్జున, హనుమప్ప, మల్లయ్య, షేక్షావలి, సిద్ధయ్య పాల్గొన్నారు. అలాగే ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. అంతకు ముందు పాఠశాలలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకును ప్రారంభించారు.

పత్తికొండ(తుగ్గలి): విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని ఆర్డీవో ఎస్.భరత్‌నాయక్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్, పేరెంట్ సమావేశాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలు పాఠశాలల్లో పోలీసులు డ్రగ్స్‌పై అవగాహన కల్పించి డ్రగ్స్ వాడమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. టగ్ ఆఫ్‌వార్ పోటీలను నిర్వహించారు. సర్పంచ్ కొమ్ము దీపిక, ఎంఈవోలు తిమ్మారెడ్డి, రమేష్, హెచ్‌ఎంలు, పీఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

తుగ్గలిలో..

పిల్లల ఉన్నతిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, అప్పుడే వారు ప్రయోజకులవుతారని ఎంపీడీఓ విశ్వమోహన్, ప్రజాప్రతినిధులు, హెచ్‌ఎంలు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్, పేరెంట్ సమావేశాలను ఘనంగా నిర్వహించారు. పగిడిరాయిలో స్థలదాత ఈశ్వరరెడ్డితో కలిసి జియోమైసూర్ సర్వీసెస్ ప్రవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ డైరెక్టర్ మానస్ రంజన్‌బిశ్వాస్, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. జొన్నగిరి జెడ్పీహెచ్‌లో స్మాట్ విద్యార్థులు, ఉత్తమ క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. పాఠశాల, ఎస్సీ హాస్టల్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని జియో మైసూర్ కంపెనీ డైరెక్టర్ తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వరలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప, సర్పంచ్ ఓబులేసు, ఎస్ఐ జయశేఖర్, ఎంఈవోలు మాలతి, రమావెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ రవి పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివితే భవిష్యత్‌లో ఉన్న శిఖరాలకు చేరుకుంటారని వక్తలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ కమ్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలురు-1 పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆలూరు సర్పంచ్ అరుణాదేవి, టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్, తహసీల్దార్ గోవింద్ సింగ్, సీఐ వెంకటచలపతి, ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓలు కోమలాదేవి చిరంజీవి రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ సూచించారు. పెద్దహోతూరు గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పీటీఎం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.


పత్తికొండలో పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్


ఆలూరు ప్రభుత్వ బాలుర-1 పాఠశాలలో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

మద్దికెర : విద్యార్థులు అందరి సలహాలను స్వీకరించి ఉన్నతంగా ఎదిగాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఎంఈఓ రంగస్వామి, ఎంపీపీ అనిత అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా విద్యాలయంలో బడివైపు అడుగు తల్లిదండ్రులతో ముచ్చట్లు అనే కార్యక్రమం నిర్వహించారు.

కృష్ణగిరి: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. మండలంలోని కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైద్యాధికారి ప్రదీప్, ఎంఈఓలు సునంధ, మద్దయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థుల చదువులో తల్లిదండ్రులు పాత్ర చాలా కీలకమని జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న, ఎస్ఐ జి.అశోక్ అన్నారు. వెల్దుర్తిలోని పలు పాఠశాలల్లో శనివారం జరిగిన ఆత్మయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కస్తూర్బాలో ఏడవ తరగతి చదువుతున్న కావేరి తండ్రి చంద్రశేఖర్ పాఠశాల అభివృద్ధికి రూ.5 వేలు అందజేశారు.తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంఈఓ రమేష్ పాల్గొన్నారు.

హాలహర్వి: విద్యార్థులు చదువులో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తారని, విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఎంఈఓ ఈరన్న, తహసీల్దార్ నజ్మాబాను, ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు.కస్తూర్బా పాఠశాలలో ఎంపీడీఓ, ఎమ్మార్వో, ఎంఈఓ పాల్గొన్నారు.

ఆలూరు: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆలూరు సీఐ వెంకటచలపతి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన సీఐ డ్రగ్స్, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

చిప్పగిరి: విద్యాభివృద్ధికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీ, జెడ్పీహెచ్ హైస్కూల్ లో నిర్వహించిన పేరెంట్,ఉపాధ్యాయ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ సావిత్రి, ఎస్ఓ సౌజన్య పాల్గొన్నారు.

ఆస్పరి: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని మండల స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ ఉష్రశ్రీ, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్, కస్తూర్బా పాఠశాలల్లో సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్యక్షతన తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కస్తూర్బాలో విద్యార్థినుల డ్యాన్స్, నాటక పదర్శన ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్ భీమేష్, హెచ్‌ఎం విజయకుమారి, ప్రిన్సిపాల్ శారూన్ స్మైలీ పాల్గొన్నారు.


ఆస్పరి కస్తూర్బాలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇసుక ట్రాక్టర్లు సీజ్

హాలహర్వి: మండలంలోని అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నజ్మాబాను శనివారం తెలిపారు. అనంతరం ట్రాక్టర్ యజమానులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్లకు, రోడ్లకు, డ్రైనేజీ అవసరాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు. ట్రాక్టర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, ఆర్ఐ మహేష్ ఉన్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రారంభానికి సిద్ధం


చిప్పగిరిలో నిర్మాణం పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంకు

చిప్పగిరి: మండల కేంద్రంలో రూ.54 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన 60,000 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు ముగిసి ప్రారంభానికి సిద్ధమైంది. గతంలో ఒకే ఓవర్ హెడ్ ట్యాంకు ఉండటంతో గ్రామంలోని ఎస్సీ, బీసీ, కొండా తదితర కాలనీలకు నీటి సరఫరా సక్రమంగా జరిగేది కాదు. ప్రస్తుతం ట్యాంక్ నిర్మాణం పూర్తవడంతో ఆయా కాలనీలకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం


పత్తికొండలో మాట్లాడుతున్న జడ్జి జ్యోతి



న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి యజ్ఞ నారాయణ

పత్తికొండ(తుగ్గలి) : మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని, అందుకు కోర్టులు మధ్యవర్తిత్వ కేంద్రాలను ఏర్పాటు చేశాయని డోన్ అడిషనల్ సివిల్ జడ్జి ఎస్.జ్యోతి తెలిపారు. శనివారం పట్టణంలోని బార్ అసోసియేషన్ భవన్‌లో మండల న్యాయ సేవాధికారం సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ..కర్నూలు జిల్లా కోర్టు ఆవరణలో మీడియేషన్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. భరణం, ప్రామిసరీ నోట్ అప్పు కేసులు, ఆస్తి తగాదాలు వంటి కేసులకు సంబంధించి ఇందులో సంప్రదిస్తే ఇరు వర్గాలతో మాట్లాడి వారికి ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరిస్తారన్నారు. రానున్న రోజుల్లో ప్రతి కోర్టులోనూ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఇటువంటి సేవలను వినియోగించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: న్యాయవాదుల మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని ఆదోని సబ్ కోర్టు జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. శనివారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..న్యాయవాదులు కక్షిదారులతో మధ్యవర్తిత్వం వహించి సున్నితంగా కేసులు పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. తద్వారా కక్షిదారులు తమ కేసుల పరిష్కారం కోసం చాలా కాలం వరకు కోర్టుకు వచ్చే పరిస్థితి తప్పుతుందన్నారు. పెండింగ్ కేసులతో పాటు కొత్తగా వచ్చే కేసుల నమోదు తగ్గుతుందన్నారు. మధ్యవర్తిత్వ సెన్సిటైజేషన్ కోసం న్యాయవాదులు తమ పేర్లను జిల్లా కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏజీపీ సిద్ధప్ప, న్యాయవాదులు వాయుజీవోత్తమ రావు,విజయ్ రాజ్, రవి,హెచ్‌కే రవి,రాజేష్ నాయుడు, రంగప్ప, విజయ్ భాస్కర్, మేకల వీరేష్, రంగన్న,చాంద్ బాషా ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేత పచ్చర్ల జట్టు


విజేత జట్టుకు ప్రైజ్‌మనీ అందిస్తున్న దాతలు

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అలంపూర్ మండలంలోని పచ్చర్ల గ్రామ జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో తిరుపతికి చెందిన జట్టు రన్నర్‌గా నిలిచింది. మొదటి బహుమతి రూ.30 వేలు దాత బోయ అన్వేష్ అందజేశారు. రెండో బహు మతి రూ.20 వేలు పటేల్ యాదవ్, శివ యాదవ్ అందించారు.


ఆస్పరిలో హోమగుండానికి పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పిస్తున్న దృశ్యం


సామూహిక హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా షష్ఠి మహోత్సవాలు

ఆస్పరి:స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం, రామతీర్థంలో వెలిసిన కుక్కే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు మల్లికార్జున శర్మ గంగపూజ, అభిషేకం, శ్రీకుక్కే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అంజనేయస్వామి మూల మంత్ర హవనము, జయాదిహోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు. చివరగా మంగళహారతులు ఇచ్చి కార్యక్రమాలను ముగించారు. భక్తులు మేళతాళాలతో కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం షష్ఠి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ముందుగా స్వామి,శ్రీవల్లి, దేవసేన ఉత్సవ మూర్తులను పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు, సామూహిక హోమాలు, పూర్ణాహుతి, మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రభోత్సవం వైభవంగా జరిపించారు. రాత్రి కూచిపూడి, భరత నాట్యం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


విశేష అలంకరణలో శ్రీవల్లి,దేవసేన సుబ్రహ్మణ్యస్వామి

అయ్యప్ప స్వామికి విశేష పూజలు

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో శనివారం అయ్యప్ప స్వామి ఆలయంలో 8వ మండల పూజను మాలధారులు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అనిల్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి గంగ పూజ, గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి హోమం, పడిపూజ, భజన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు. మాలధారులు అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ఈశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.


తంగరడోణలో పడిపూజ నిర్వహించిన దృశ్యం